# స్మార్ట్ సిటీలో చెత్త గోల!

- చెత్త తరలింపులో అధికారుల అలసత్వం
- చిత్తశుద్ధి లేని పారిశుధ్య సిబ్బంది
- ముక్కులు మూసుకుంటున్న ప్రజలు
- ఉక్కపోత.. దోమల మోతతో సతమతం



విద్యుత్ నగర్‌లోని ఒక వీధిలో చెత్తలో ఉన్న ఆహార పదార్థాలు తింటున్న ఆవులు

**బోట్‌క్లబ్:** కాకినాడ నగరం స్మార్ట్‌సిటీ స్థాయికి ఎదిగినప్పటికీ చెత్త సమస్య మాత్రం తీరడం లేదు. రోజు టన్నుల కొద్దీ వస్తున్న చెత్తను తరలింపులో కార్పొరేషన్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఏ వీధిలో చూసినా చెత్త గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తోంది. రోడ్డుపక్కన చెత్త ఉన్న చోటల్లా పశువులు, కుక్కలకు స్థావరాలుగా మారుతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు అటువైపు ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కాకినాడ నగరంలో సుమారు ఐదు లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతీ రోజు సుమారు 90 టన్నులు పైగా చెత్త వస్తోందని కార్పొరేషన్ అధికారులు అంచనా. కాకినాడ నగరంలో సుమారు వెయ్యిమందికి పైగా పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరు ప్రతీరోజు వారికి కేటాయించిన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు సిల్ట్ తీయాల్సి ఉంది. వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో రోడ్లులపై చెత్త పేరుకొనిపోవడంతోను, డ్రైనేజీలు కొంపు కొట్టడంతో దోమలు ఉధృతి ఎక్కువై నగర ప్రజలు రాత్రి సమయాల్లో పడరాని పాట్లు పడుతున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో చెత్తను తరలిస్తున్నా, శివారు ప్రాంతాల్లో చెత్తను తరలించడంతో తీవ్ర జాప్యం ఎదురవుతోంది. విద్యుత్‌నగర్, అశోక్‌నగర్, ఎల్‌బీ నగర్, నాన్సీ స్ట్రీట్ , జగన్నాథపురం, పెదమార్కెట్, కచేరిపేట, వంటి ప్రాంతాల్లో చెత్తను రెండు, మూడు రోజులకు ఒకసారి తరలిస్తున్నారు.

**వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటా చెత్త సేకరణ**

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేసేవారు. దీంతో ఏ వీధిలో కూడా చెత్త కనిపించేందుకు కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ చెత్త సేకరణ నిలిపివేయడంతో ప్రజలు గత 9 నెలలుగా పడరానిపాట్లు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది ప్రతీ ఇంటికి వచ్చి ఇంటిలో ఉన్న తడి, పొడి చెత్తను విడివిడిగా తీసుకొనేవారు. ప్రస్తుతం ఇంటింటికీ చెత్త సేకరణ నిలిపివేవయడంతో ప్రజలు పలు వీధుల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌ల వద్ద చెత్తను వేస్తున్నారు. దీంతో వీధుల్లో ఏర్పాటు చేసిన డంపర్‌బిన్‌లు నిండిపోయి చెత్త రోడ్డుపై పడిపోతుంది. ఈ డంపర్‌బిన్‌లలోని చెత్తను రోజు తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

**పర్యవేక్షణ కరవు**

నగరంలో వెయ్యిమందికిపైగా పారిశుధ్య సిబ్బంది ఉన్నా చెత్త తరలించలేకపోవడానికి ప్రధాన కారణం పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. కొందరు పారిశుధ్య సిబ్బంది విధులకు వచ్చినట్లు వచ్చి మస్తర్లు వేయించుకొని, పనిచేస్తున్నట్లు ఫొటోలు తీయించుకొని ఇంటికి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెగ్యులర్ పారిశుధ్య సిబ్బంది విధులకు వచ్చినా పనులు చేయకుండా కాలక్షేపం చేసి కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తున్నారనేది బహిరంగ రహస్యంగా మారింది.

**ఫాగింగ్ ఊసే లేదు**

గత ప్రభుత్వ హయాంలో దోమలు రాత్రి సమయాల్లో విజృంభించకుండా ప్రతి వీధిలో ఫాగింగ్ చేసేవారు. దీంతో ప్రజలు రాత్రి సమయాల్లో హాయిగా నిద్రపోయేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి అసలు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఏ వీధిలో చూసినా చెత్త పేరుకుపోవడంతో అక్కడ దోమలు ఆవాసాలుగా చేసుకోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండా కాలం కావడంతో ఉక్కపోతను అధిగమించేందుకు రాత్రి సమయాల్లో కిటికీ తలుపులు తీస్తే చాలు గుంపులు గుంపులుగా దోమలు వస్తున్నాయి. దీంతో ప్రజలు భయపడి ఉక్కపోతనైనా భరిస్తున్నారు తప్ప కిటికీలు తెరవడం లేదు.



నాన్సీ స్ట్రీట్‌లో డంపర్‌బిన్ నిండిపోయి రోడ్డుపై పడుతున్న చెత్త



అశోక్‌నగర్ ప్రధాన రహదారిలో డంపర్‌బిన్‌లో చెత్త ఎక్కువై రోడ్డుపై పడుతున్న దృశ్యం

**చెత్తను రోజూ తరలించాలి**



ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే చెత్తకుప్పల వద్ద వచ్చేసరికి వాసనకు ముక్కు చూసుకోవాల్సి వస్తోంది. డంపర్‌బిన్‌లు రోజు తరలించకపోవడంతో అక్కడ దుర్వాసన భరించలేకపోతున్నాం. కార్పొరేషన్ అధికారులు స్పందించి డంపర్‌బిన్‌లో చెత్తను నిత్యం తరలించే ఏర్పాటు చేయాలి.

మలకల వెంకటరమణ, కచేరిపేట

**దోమలతో ఇబ్బంది పడుతున్నాం**



రోడ్లపై చెత్తకుప్పల వల్ల, డ్రైనేజీలో సిల్ట్ తీయకపోవడంతో రోజురోజుకీ దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో దోమలు కారణంగా నిద్రపోవడం చాలా కష్టంగా ఉంది. ఒకపక్క ఉక్కపోత, మరోపక్క దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. కార్పొరేషన్ అధికారులు చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలి.

ఏలూరి రాణి, పెద్దమార్కెట్

## క్లుప్తంగా

### చిత్రలేఖనంలో లోకేష్ ప్రతిభ



లోకేష్‌కు బహుమతి అందిస్తున్న మంత్రి సుభాష్

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** 54వ జాతీయ భద్రతా దినోత్సవాల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కాకినాడ సీపోర్టులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో స్థానిక తిలక్ స్ట్రీట్‌లోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎం.లోకేష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆదివారం ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన భద్రతా దినోత్సవాల ముగింపు వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నాడు. లోకేష్ ఎస్ఎస్ఆర్‌కె మున్సిపాల్ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. బహుమతి ప్రధాన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఏ.పుష్పగిరి, పాఠశాల డ్రాయింగ్ టీచరు ఎస్.గంగాభవాని, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, పిఈటీ సూరిబాబు పాల్గొని లోకేష్‌ను అభినందించారు.

### శిల్పారామం అభివృద్ధి పనుల పరిశీలన



శిల్పారామంలో పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంజులారెడ్డి

**కాకినాడ రూరల్:** స్థానిక సూర్యారావుపేట బీచ్ రోడ్డులోని శిల్పారామాన్ని చైర్‌పర్సన్ మంజులారెడ్డి ఆదివారం సందర్శించారు. అక్కడి అభివృద్ధి పనులతో పాటు జానూస్ వాటర్ ల్యాండ్ పనులను ఆమె పరిశీలించారు. అలాగే శిల్పారామంలో ఏర్పాటు చేసిన హ్యాండీక్రాఫ్ట్ స్టాల్‌ను ప్రారంభించారు. శిల్పారామం అభివృద్ధితో పాటు సందర్శకుల సంఖ్య పెంచేందుకు అవసమైన మౌలిక సదుపాయాల కోసం నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. చైర్‌పర్సన్‌కు శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ అధికారి మోహన్ తేజ స్వాగతం పలికారు. జరుగుతున్న పనులు గురించి వివరించారు.

### స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

**కరప:** వెనుకబడిన తరగతుల వారికి (బీసీలు), ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణ పరపతి కల్పించనుందని, అర్హులు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.అనుపమ ఆదివారం ఒకప్రకటనలో కోరారు. వెనుకబడిన తరగతులు అనగా బీసీ–ఎ, బి, డి, ఇ వర్గాలవారు, ఈడబ్ల్యూఎస్ అనగా ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ సామాజిక వర్గాలవారికి జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా, కాపు సామాజికవర్గం వారు అనగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గం వారికి స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఈ పథకాల ద్వారా నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకు రుణం, ప్రభుత్వ రాయితీతో ఆర్థిక సాయం మంజూరు చేయనున్నట్టు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు తమ రైస్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ ఫోన్‌తో మీ సేవ, గ్రామ సచివాలయం ద్వారా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతలు, పథకం మంజూరుకు కావలసిన అనుభవం సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అనుపమ కోరారు.

### కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

| | |
|---|---|
| **మున్సిపల్ అధికారులు** | |
| కమిషనర్ | 9100945696 |
| అదనపు కమిషనర్ | 9849907096 |
| డిప్యూటీ కమిషనర్ | 9949921555 |
| ఏసీపీ | 9989743049 |
| ఎంహెచ్‌వో | 9949432320 |
| ఎస్ఈ | 9959988639 |
| మేనేజర్ | 7093519888 |
| టీపీఆర్వో | 9701385284 |
| అకౌంట్ ఆఫీసర్ | 9849907084 |
| సిటీ మిషన్ మేనేజర్ | 7901610084 |
| **పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు** | |
| డివిజినల్ పంచాయతీ అధికారి | 9849903188 |
| ఫుడ్ ఇన్‌స్పెక్టర్ | 9494297564 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ | 9100121109 |
| జిల్లా వ్యవసాయశాఖాధికారి | 8331056483 |
| దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ | 9290145126 |
| గృహ నిర్మాణశాఖ డీఈ | 7093930577 |
| పశుసంవర్ధకశాఖ జేడీ | 9989932835 |
| డీసీసీబీ జీయం | 8341208227 |
| జిల్లా సహకారశాఖ అధికారి | 9100109168 |
| **జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు** | |
| సూపరింటెండెంట్ | 98499 03870, 0884 2302001 |
| సీఎస్ ఆర్ఎంవో | 98499 03871 |
| డీసీఎస్ ఆర్ఎంవో | 98499 03871 |
| ఆర్ఎంవో | 0884 2302003 |
| డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ | 0884 2302002 |
| అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) | 98499 03873, 0884 2302004 |

### టీకాలతో ఆరోగ్యానికి రక్షణ

**కాకినాడ రూరల్:** టీకాలతో జీవితాంతం రక్షణ లభిస్తుందని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ టీకాల దినోత్సవం పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని టీకాల వలన కలిగే ప్రయోజనాలుపై అవగాహన కల్పించారు.

### ముగిసిన సింపోజియం టెక్ ఫెస్ట్



రోబోటిక్ అప్లికేషన్ వర్క్‌షాపును సందర్శించిన వీసీ ప్రసాద్

**బాలాజీచెరువు:** జేఎన్‌టీయూకేలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ ఆదివారం ముగిసింది. ఈసీఈ, సీఎస్ఈ, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులు, ప్రాజెక్టులను వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ ఆధ్వర్యంలో కోయంబత్తూర్ జీకర్స్ ఎంప్లాయిమెంట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన రోబోటిక్ అప్లికేషన్ కస్టమ్ ఎంబెడెడ్ బోర్డు అభివృద్ధి చేసే అంశంపై నిర్వహించిన వర్క్‌షాపును సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగం మరువరానిది

- మంత్రి వాసంశెట్టి సుభాష్
- పాల్గొన్న ట్రైనీ కలెక్టర్ భావన



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్



అమరజీవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

**కాకినాడ సిటీ:** పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్ష, ప్రాణ త్యాగం వల్లే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీ బాయిలర్స్, ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీస్ శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సీబీఎం కూడలిలోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి సుభాష్, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎం.లల్లి ఇతర అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ అమరజీవి పట్టుదల, ధైర్య సాహసాలు, దేశ స్వాతంత్ర్యంలో ఆయన చేసిన కృషిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సిబ్బంది, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలో..**

**కాకినాడ క్రైం:** అమరజీవి జయంతిని స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ శ్రీరాములు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ శ్రీహరి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..**

**కాకినాడ రూరల్:** ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని కాకినాడ రూరల్ మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసి జయంతోత్సవ కార్యక్రమంలో అమరజీవి చిత్రపటానికి విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, వైద్యుడు అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్ తదితరులు ఘన నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ఆయన చేసిన పోరాటాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు.

# సత్తెమ్మతల్లి ఆలయం ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కన్నబాబు

**కరప:** మండలం పెనుగుదురులోని దేవుడు కాలనీలో సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణం పూర్తికాగా, ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. దేవుడు కాలనీలో చెట్టుకింద రేకుల షెడ్‌లో సత్తెమ్మ తల్లిని నిలిపి, ఆప్రాంత పూజలు పూజలు చేసేవారు. కాలనీవాసుల వివతి మేరకు 2024లో అప్పటి ఎమ్మెల్యే, మాజీమంత్రి కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేయగా, సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ బండారు సుజాత, గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సత్తెమ్మ తల్లిని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్, మాజీమంత్రి కురసాల కన్నబాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబును కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.

## కెనరా బ్యాంకు వితరణ



వాషింగ్ మెషీన్, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

**బాలాజీచెరువు:** కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ కాకినాడ రీజనల్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి యూవీవీఎస్ హరివర్మ, రాష్ట్ర చైర్మన్ సంజయ్‌రామ్ హాజరుకాగా 43 శాఖల సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఎల్‌బీ నగర్ అనాథ ఆశ్రమ సేవా సమితికి వాషింగ్ మెషీన్, నిత్యావసర వస్తువులతో పాటు పండ్లు అందజేశారు. అనంతరం కెనరా బ్యాంక్‌లో తాత్కాలిక ఉద్యోగి తల్లికి రూ.65 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, సెంట్రల్ కమిటీ సభ్యురాలు పి.అరుణ, యూనియన్ కార్యదర్శి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా నూకాలమ్మ పూల గరగ ఉత్సవం



ఉత్సవానికి ఆలయంలో సిద్ధంగా ఉంచిన పూల గరగ

**పెద్దాపురం:** మండలం కాండ్రకోట నూకాలమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పూల గరగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పర్యవేక్షణలో గరగలను గ్రామంలో ఊరేగించారు. భక్తి శ్రద్ధలతో గరగలపై కొత్త చీరలను పొన్నుగా వేసి ఆ చీరను ధరిస్తే శుభకరమని భక్తుల నమ్మకం. దీంతో గ్రామంలో వీధి వీధినా, గడపగడపకు అమ్మవారి గరగను ఊరేగించారు. గరగల నృత్యంతో భక్తులు గ్రామంలో వీధివీధినా నాట్యమాడుతూ పూజలు చేశారు. పూల గరగ ఉత్సవంలో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, మాజీ ఉప సర్పంచ్ సూర్య చక్రప్రకాష్ తదితరులతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### కరప మండల గ్రామ సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు

ఎం.అనుపమ, ఎంపీడీఓ 9346790319,
పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ 9908778808

| గ్రామం | సర్పంచ్ | | కార్యదర్శి | |
|---|---|---|---|---|
| అరట్లకట్ట | గోపి సత్యవేణి | 7993605566 | వై.రామ్‌జీ | 7416299365 |
| జి.భావారం | రొక్కాల గనిరాజు | 9502319888 | కె.సంతోష్ మహదేవశర్మ | 9666731272 |
| గొడ్డటిపాలెం | గోన అనూష | 8247395677 | పి.త్రిమూర్తులు | 9912985999 |
| గొర్రిపూడి | కానూరి రమాదేవి | 6301293869 | కేఎస్ఎస్ సుధారాణి | 9441031469 |
| | | | ఎస్.వీరబాబు | 9959327477 |
| కరప | సాదే ఆశాజ్యోతి | 9532066467 | యు.నిర్మలాదేవి | 9705687699 |
| కొరిపల్లి | పలివెల నాగేశ్వరరావు | 9666375249 | ఆర్.సుబ్బలక్ష్మి | 9640833799 |
| కూరాడ | రావుల సూర్యచంద్రావతి | 9014124070 | ఎం.దుర్గాప్రసాద్ | 9494894376 |
| నడకుదురు | డేగల లలితకుమారి | 9666566235 | వి.గోపాలకృష్ణ | 9491369021 |
| | | | కె.వరిజ | 9676476445 |
| పాతర్లగడ్డ | నాగిరెడ్డి ఏసుబాబు | 9948445419 | పి.సుధాకర్ | 8309460718 |
| పెదకొత్తూరు | చింతా నాగలక్ష్మి | 9848295290 | పి.సునీల్ | 9705804540 |
| పెద్దాపురప్పాడు | బిరుదా సరస్వతి | 7993903954 | ఎం.వీరభద్రరావు | 9248356675 |
| సిరిపురం | నున్న సుజాత | 9989417657 | డి.దుర్గాభవాని | 9491729558 |
| వాకాడ | అడబాల సత్య | 9951975888 | పి.సునీల్ | 9705804540 |
| వలసపాకల | వాసంశెట్టి రామారావు | 9553395145 | ఎం.విజయలక్ష్మి | 9912495319 |
| వేళంగి | సవిలే నీలిమ | 8790503563 | పి.వీరభద్రరావు | 7702400927 |
| విజయరాయుడుపాలెం | వి.సీతారామరాఘవ | 9182824192 | ఎస్.వీరబాబు | 9959327477 |
| యండమూరు | మార్లెళ్ల శ్రీనివాసరావు | 8688433626 | పిఎస్‌వీఆర్ బహ్మానందం | 9912697957 |
| జెడ్.భావారం | కొత్త నాగలక్ష్మి | 9014074678 | వి.శ్రీదేవి | 9490710952 |
| పెనుగుదురు | రెడ్డిపల్లి వెంకటమాధవి | 8498033555 | బి.చంద్రకళ | 7036554234 |
| గురజనాపల్లి | అనుసూరి శ్రీనివాసరావు | 9640273737 | ఎంవీఎస్ఎస్ఎన్ సురేష్ | 9949859045 |
| కొంగోడు | నక్కా అప్పలస్వామి | 9494106999 | పి.వీరభద్రరావు | 7702400927 |
| వేములవాడ | కమిడి మంగాదేవి | 9959570866 | పి.ఉమామహేశ్వరి | 9848914135 |
| ఉప్పలంక | బొమ్మిడి నయోమి | 6305247836 | ఎం.భవాని | 7989606142 |

### 23న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

**సామర్లకోట:** స్థానిక ఉండూరు రైల్వే గేటు సమీపంలోని ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఈనెల 23వ తేదీ ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు. వల్లూరి సత్యేంద్రకుమార్ పేరుతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, సీనియర్, జూనియర్ విభాగాలల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. సీనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటరున్నర, జూనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటరు దూరం వెళ్లి రావలసి ఉంటుందని చెప్పారు. తక్కువ సమయంలో వచ్చిన ఎడ్లను విజేతలుగా నిర్ణయిస్తామని తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాలల్లో విడి విడిగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

### దివిలిలో ట్రాఫిక్ సమస్యకు చెక్



దివిలి జంక్షన్ బ్రిడ్జిపై చేపల వ్యాపారులను తరలిస్తున్న ఎస్ఐ మౌనిక

**పెద్దాపురం:** నిత్యం రద్దీగా ఉండే మండలంలోని దివిలి జంక్షన్ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఆదివారం ఎస్ఐ వి.మౌనిక చర్యలు చేపట్టారు. దివిలి–చంద్రమాంపల్లి బ్రిడ్జిపై ప్రతి వారం చేపల విక్రయాలు సాగించడంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సాక్షి పలుమార్లు ఇచ్చిన కథనంపై ఎస్ఐ స్పందించి ఆదివారం ఉదయం చేపల వ్యాపారులకు వేరే ప్రదేశాన్ని కేటాయించి బ్రిడ్జిపై ఎటువంటి వ్యాపారాలు సాగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐ తీసుకున్న చొరవ పట్ల స్థానికులు అభినందించారు.

# ఐటీఐ విద్యార్థులకు బహుమతులు




అందుకున్న బహుమతులతో విద్యార్థులు

**బాలాజీచెరువు:** జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా వివిధ కంపెనీలు నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్, వ్యాస రచన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ ఆదివారం తెలిపారు. ఐటీఐ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 9 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. ఎస్ఆర్ఎంటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ట్రైనీ కలెక్టర్ భావన, కార్మిక, ఫ్యాక్టరీస్‌శాఖ అధికారులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేసారని తెలిపారు.

## సాగరతీరంలో సందడి..



పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగరతీరం

**కొత్తపల్లి:** రోజురోజుకూ ప్రచండభానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండవేడి భరించలేక జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వెళ్లి సేద తీరుతున్నారు. తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పర్యాటకుల ఆట పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారి దర్శించుకుని వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో తీర ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగింది.